ఇంటి పన్నుల వసూలు వేగవంతం చేయాలి

శావల్యాపురం: ఇంటి పన్నుల వసూలు పురోగతి వేగవంతం చేయాలని ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను మండలంలోని 15 గ్రామపంచాయతీలు ఉండగా ఇప్పటి వరకు రూ.44 లక్షలు బకాయి ఉండగా రూ.6 లక్షల రూపాయల మాత్రమే వసూలు చేసినట్లు చెప్పారు. గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్ను చెల్లింపులపై అవగాహన కల్పించాలన్నారు. ఇంటి పన్ను వసూలు మార్చి నాటికి నూరుశాతం అయ్యేలా క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు వలంటీర్ల పర్యవేక్షణ చేయాలన్నారు. అలాగే ఇంటి పన్ను వసూలుకు సంబంధిత ఇంటి యాజమానికి రసీదు అందజేయాలన్నారు. అలాగే 2024–25 ఆర్థిక సంవత్సరానికి గ్రామపంచాయతీ అభ్యున్నతిపై ఈ–గ్రామ స్వరాజ్య పోర్టల్ నమోదు నూరుశాతం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సదస్సులో ఈవోపీఆర్‌డీ పి.సుగుణ పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండంలోని ములకలూరు గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. గామ సర్పంచ్ కంచర్ల కోటేశ్వరమ్మ బాబు రూ.1.5 లక్షల సొంత నిధులతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అంబేడ్కర్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో వంగవల్లు వెంకట్రావు, బొడ్డుపల్లి చిన్నకోటేశ్వరరావు, కంచర్ల భాస్కరరావు, అంజయ్య, సోమేపల్లి కొండలు, కమిటీ సభ్యులు మందా లింగారావు, ఏసు, దావీదు, రాములు, కోటేశ్వరరావు, రామారావు, వారణాసి తదితరులు పాల్గొన్నారు.







రూ.15 కోట్లతో ఆరు విద్యుత్ సబ్‌స్టేషన్లు

- టిడ్కో, జగనన్న కాలనీల్లో రూ.10 కోట్లతో నిర్మాణమైన రెండు సబ్‌స్టేషన్లు ప్రారంభం
- ప్రజలకు నాణ్యమైన త్రీఫేజ్ విద్యుత్ సరఫరాకు ఆరు గ్రామాల్లో సౌకర్యాలు
- ప్రారంభించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు


టిడ్కో గృహాల వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రధాన రూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, విద్యుత్‌శాఖ అధికారులు

నరసరావుపేట: గడచిన ఐదేళ్ల జగనన్న ప్రభుత్వంలో నియోజకవర్గంలో రూ.15 కోట్ల వ్యయంతో ఆరు విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టి పూర్తిచేసి ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం చిలకలూరిపేట రోడ్డులోని టిడ్కో గృహాలకు రూ.4 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్, వినుకొండ రోడ్డు జగనన్న కాలనీలోని లబ్ధిదారుల కోసం రూ.6 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన అత్యాధునికమైన సెమి ఇండోర్ సబ్‌స్టేషన్‌లకు రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ గతంలో రావిపాడులో రూ.3 కోట్లతో ఒక సబ్‌స్టేషన్, రొంపిచర్ల మండలం బుచ్చిబాపన్నపాలెంలో ఒక సబ్‌స్టేషన్ నిర్మించి ప్రారంభించామన్నారు. అలాగే జేఎన్‌టీయు కళాశాల, పట్టణంలోని రావిపాడు రోడ్డులో సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టి పూర్తి చేస్తామన్నారు. వీటి వలన లో–ఓల్టేజ్, ట్రాన్స్‌మిషన్ నష్టాలు లేకుండా ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు దోహదం చేస్తాయన్నారు. అలాగే ఐదువేల జనాభాకు మించి ఉన్న గ్రామాల్లో 24గంటల పాటు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేసేందుకు 40ఏళ్ల క్రితం వేసిన అన్నీ పోల్స్‌ను మార్పులు చేసే ప్రక్రియ ఆరు గ్రామాల్లో చేపట్టి పూర్తిచేశామన్నారు. నరసరావుపేట మండలం ములకలూరు, ఇక్కుర్తి, అల్లూరివారిపాలెం, రొంపిచర్ల మండలం విప్పర్లరెడ్డిపాలెం, సంతగుడిపాడు గ్రామాల్లో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా పంపిణీ పూర్తిచేశామన్నారు. జొన్నలగడ్డ, రావిపాడు, లింగంగుంట్ల గ్రామాల్లో పనులు ప్రారంభించటం జరిగిందన్నారు. దీని వలన చిన్నతరహా పరిశ్రమలు, రైస్ మిల్లులకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి సమస్య ఉండదన్నారు. జగనన్న ప్రభుత్వంలో విద్యుత్ పంపిణీ పటిష్టంగా జరుగుతుందన్నారు. టీడీపీ నాయకులు చెబుతున్నట్లుగా ఎక్కడా పవర్ కట్ లేదన్నారు. విద్యుత్ పంపిణీలో మన రాష్ట్రానికి ఆల్ ఇండియా లెవల్‌లో ఏ గ్రేడ్ వచ్చిందన్నారు. దీనిని బట్టి జగనన్న పాలన ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాసరావు, కన్‌స్ట్రక్షన్ ఇఇ శ్రీనివాసరావు, ఎం అండ్ పి ఇఇ నాగేశ్వరరావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు సుందరబాబు, ప్రసాదు, వై.ఏడుకొండలు, వెంకటేశ్వరరెడ్డి, ఆనందరావు, ఏఇలు పాల్గొన్నారు.

వేర్వేరు గ్రామాలకు మంచినీటి సరఫరా

ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో నీటి సమస్యకు పరిష్కారం


రేమిడిచర్ల లో నీటి సరఫరా చేస్తున్న దృశ్యం

బొల్లాపల్లి: ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రత్యేక చొరవతో మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. మండలంలో నీటి కొరత తీవ్రంగా ఉన్న గ్రామాలను గుర్తించి ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు సిద్ధమయ్యారు. నీటి సమస్య ఎదుర్కొంటున్న గ్రామాలైన మన్నేపల్లి తండా, షోలాయపాలెం, గండిగనుమల, రేమిడిచర్ల, గుమ్మనంపాడు, చక్రాయపాలెం, దొమల గుండం తదితర పంచాయతీల్లో నీటి సమస్య గుర్తించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా పూనుకున్నామని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ ఎం.అకాష్ తెలిపారు. ప్రస్తుతం దొమలగుండం, రేమిడిచర్ల గ్రామాల్లో ఆయా పంచాయతీల నిధులతో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరాకు ఏర్పాటు చేశామని తెలిపారు. మరో రెండు చక్రాయపాలెం, గంగిగనుమల గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధతో ట్యాంకర్లను ఏర్పాటు చేశారు. మిగిలిన గ్రామాల్లో మార్చి నుంచి ట్యాంకర్లు ఎర్పాటు చేస్తామని ఎఈ తెలిపారు.

చకచకా పేదల ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్

- నాదెండ్లలో 90 శాతం పూర్తి
- సొంతింటి కల నెరవేరిందంటూ లబ్ధిదారులు ఆనందం

నాదెండ్ల: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు ఇచ్చిన ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ పనులు సచివాలయాల్లో 90 శాతం పూర్తయ్యాయి. సొంతింటి కల నెరవేరిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 16 సచివాలయాల పరిధిలో 2370 మందికి ఇళ్ల పట్టాలు అందాయి. మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలోనే నాలుగు సచివాలయాల పరిధిలో 1224 మందికి ఇంటి పట్టాలు దక్కాయి. గ్రామంలోని నాలుగు సచివాలయాల పరిధిలో ఉన్న లబ్ధిదారులు మూడో సచివాలయంలో ఈ నెల 1వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ పనులు ప్రారంభించారు. సోమవారం నాటికి 95 శాతం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయింది. గత నెల 27న ప్రారంభమైనప్పటికీ లాగిన్ 1వ తేదీ నుండి అమల్లోకి వచ్చింది. ఉదయం ప్రారంభమై రాత్రి 10 గంటల వరకూ కూడా సచివాలయ సిబ్బంది శ్రమిస్తున్నారు. ప్రస్తుతం అన్ని సచివాలయాల పరిధిలో నేటికీ రిజిస్ట్రేషన్ పనులు కొనసాగుతున్నాయి. మిగిలిన 10 శాతం లబ్ధిదారుల్లో పలువురు మృతి చెందటం, వివిధ కారణాలతో అందుబాటులో లేకపోవటం, వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉండటంతో ఇతర ప్రాంతాలకు కూలీలకు తరలివెళ్లటం వంటి కారణాలరీత్యా రిజిస్ట్రేషన్లు నిలిచాయి. త్వరలో నూరుశాతం రిజిస్ట్రేషన్లు పూర్తి చేసేందుకు రెవెన్యూ, సచివాలయ సిబ్బంది కృషి చేస్తున్నారు. త్వరలో ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో ఇళ్లు నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం


విరాళం అందజేస్తున్న ఆంజనేయులు, శివలలిత దంపతులు

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులకు పట్టణానికి చెందిన కొప్పురావూరి ఆంజనేయులు, శివలలిత దంపతులు రూ.5 లక్షల విరాళం అందజేశారు. ఆలయ కార్యాలయంలో ఆదివారం దాతలు విరాళం చెక్‌ను ఆలయ ఈవో టి.సుధాకరరెడ్డికి అందించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు కాకుమాను బదరీనారాయణ, కాళికామాత అభివృద్ధి కమిటి సభ్యులు వంకా శ్రీనివాసరెడ్డి, అర్చకస్వాములు నండూరి కాళికృష్ణ, కొత్తలంక కార్తీకేమ తదితరులు పాల్గొన్నారు. అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేసి సహకరించాలని ఈవో కోరారు. విరాళాలు ఇచ్చే దాతలకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుందని తెలిపారు.

నేడు ఇర్లపాడులో జగనన్న సురక్ష మెడికల్ క్యాంపు

నాదెండ్ల: మండలంలోని ఇర్లపాడు గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే మెడికల్ క్యాంపు కావూరు మెడికల్ ఆఫీసర్‌తో పాటూ మరో ఇరువురు స్పెషలిస్ట్ వైద్యులు హాజరుకానున్నట్లు తెలిపారు. రెండోదఫా జరిగే వైద్య శిబిరాన్ని అమీన్‌సాహెబ్‌పాలెం, ఇర్లపాడు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.







పుట్టకోటలో ఘనంగా ప్రతిష్టా మహోత్సవం

పార్టీ నాయకులతో పాల్గొని పూజలు చేసిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు

యడ్లపాడు: మండలంలోని పుట్టకోట గ్రామంలో వేంచేసియున్న మొలమంటి వంశీయుల కులదైవం అంకమ్మతల్లి దేవాలయ ప్రతిష్టా మహోత్సవం ఆదివారం రాత్రి వైభవోపేతంగా నిర్వహించారు. భారీ విద్యుత్ దీపాల నడుమ పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తుల రాకపోకలతో గ్రామంలో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు పార్టీ నాయకులతో కలిసి హాజరయ్యారు. గ్రామస్తులతో కలిసి రాజేష్‌నాయుడు వీధుల్లో పర్యటిస్తూ.. అందర్నీ పలకరిస్తూ.. స్థానిక సమస్యల్ని తెలుసుకుంటూ ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయంలో పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ఘంటా శంకర్, ఎంపీపీ పిడతల ఝాన్సీ సాగర్, గ్రామ పంచాయతీ సర్పంచ్ మొలమంటి వెంకట సుబ్బారావు ఉపసర్పంచ్ మానం సాంబయ్య, మాజీ సర్పంచ్ పల్నాటి గురువయ్య, నాయకులు రాట్నాల రామయ్య, వెల్లల పద్మారావు, మొలమంటి అంకారావు, గాలి బుచ్చియ్య, జాకీర్ రెహమాన్, కట్టా ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు బాపనపల్లి శ్రీనివాసరావు, నందికోలు కోటయ్య, సైదులు అల్లడి రవికుమార్, అల్లం ఆంజనేయులు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు జగనన్న ఉపాధి



వాహన తాళాలు అందజేస్తున్న రాజేష్‌నాయుడు

చిలకలూరిపేట: మత్స్యసంపద అభివృద్ధితో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు చెప్పారు. పీఎంమత్స్యసంపద యోజన కింద మండలంలోని బొప్పూడి గ్రామానికి చెందిన ఎలిజాల వినయ్‌బాబుకు 40 శాతం రాయితీపై మంజూరైన డీసీఎం వ్యానును మల్లెల రాజేష్‌నాయుడు సోమవారం ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యసంపద పెంచడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫిష్ ఆంధ్రా–ఫిట్ ఆంధ్రా పథకాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. నిరుద్యోగ యువతకు 40 శాతం, ఎస్సీ, ఎస్టీ యువతకు 60 శాతం రాయితీతో యూనిట్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి సంజీవరావు, నియోజకవర్గ అధికారి భాగ్యలత, మండల అధికారి పర్చూరి సంధ్యారాణి పాల్గొన్నారు.

దేశ చరిత్రలోనే వలంటీర్ వ్యవస్థ మైలురాయి

- ఇతర రాష్ట్రాలు సైతం మన వలంటీర్ వ్యవస్థను పొగుడుతున్నాయి
- వలంటీర్ల అవార్డుల ప్రదానోత్సవ సభలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



వలంటీర్లకు అవార్డులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఈపూరు: వలంటీర్ అనే పేరులోనే సేవ అనే పదం ఉందని, ప్రజలకు సేవచేస్తూ ఎన్నో మన్నలు పొందుతున్న గొప్ప వ్యక్తులు వలంటీర్లు అని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రభుత్వం తరపున మండలంలోని 225 మందికి సేవా మిత్ర, సేవా వజ్ర, సేవా రత్న అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ దేశ చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను నియమించి సేవ చేయిస్తున్న ఘనత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు.

గతంలో పింఛన్ పొందాలంటే నానా ఇబ్బందులు పడేవారని, నేడు లబ్ధిదారులు నిద్రలేవక ముందే వారి ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్‌లు అందిస్తున్నారని, ఇలాగే ప్రభుత్వంలోని అన్ని సేవలు అందిస్తూ ఆ కుటుంబంలోని సభ్యుడిగా వలంటీర్లు మన్ననలు పొందుతున్నారన్నారు. అయితే అలాంటి వలంటీర్ వ్యవస్థను కొన్ని సంస్థలు దూరంగా ఉంచేందుకు ప్రయత్నం చేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వలంటీర్ వ్యవస్థను ప్రప్రథమంగా ప్రవేశపెట్టింది మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. తెలుగుదేశం పార్టీ కావాలనే వలంటీర్ వ్యవస్థపై తప్పుడు ప్రచారం చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే జమ చేసిన సంగతి కేంద్ర ప్రభుత్వం ఆర్‌బీఐ గుర్తించిందని, చంద్రబాబు నాయుడు మాత్రం లక్షల కోట్లు తమ మంత్రుల ఖాతాలకు, లోకేష్ బాబు ఖాతాకు జమ చేసినట్లు గుర్తించిందన్నారు. అధికారంలో ఉండి మేము అనాల్సిన మాటలు వారు అంటున్నారని, రాబోయేది అత్యధిక స్థానాలతో జగన్‌మోహన్ రెడ్డి అని, అది తెలుగుదేశం పార్టీ నాయకులు గుర్తుపెట్టుకుంటే బాగుంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో పొత్తుల కుంపటి కుదరలేదరని, పవన్ కల్యాణ్ 50 సీట్లు కావాలని, బీజేపీ 50 సీట్లు కావాలని పోటీ పడుతుంటే ఏం చేయాలో అర్థం కాక తండ్రీ కొడులు తల గోక్కుంటున్నారన్నారు. పవన్ ముఖ్యమంత్రి కావాలంటే చంద్రబాబు నాయుడుకు మింగుడు పడటం లేదని ఆయన ఎద్దేవా చేశారు. ఇంత వరకు సీట్ల పొత్తే కుదురకుండా తాము అధికారంలోకి వస్తామని చెప్పడానికి సిగ్గు ఉండాలన్నారు.

జీవీది అంతా నేరచరిత్రే

మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుది అంతా నేర చరిత్రే అని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మనుష్యులను చంపడంలో ఆయన ప్రావీణ్యుడని, దొంగ వ్యాపారాలు చేయడంలో దిట్ట అని గుండ్లకమ్మలో ఉన్న రాళ్ల గుండ్లకు రంగు వేసి ఇతర రాష్ట్రాల్లో గుళికలు అని చెప్పి అమ్మి లక్షలు సంపాదించాడని, సింగరచెరువులోని ఇసుకకు రంగు కలిపి వర్మి కంపోస్టు అని అమ్మి కోట్లకు పడగలెత్తారని, ఇలాంటి బురిడీ బాబాను వినుకొండ ప్రజలు మునుపెన్నడూ చూసి ఉండరని అన్నారు. బురిడీ బాబా అధికారంలో ఉన్నంత కాలం వినుకొండ నియోజకవర్గంలో ఏ అభివృద్ధి కార్యక్రమం చేశారో చెప్పాలని, ఇప్పుడు తాము చేస్తున్న అభివృద్ధికి రకరకాలుగా అడ్డు పెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని, దీనిని ప్రజలు తిప్పి కొట్టేందుకు సిద్ధమయ్యారన్నారు. మండలంలో 225 వలంటీర్లు సేవా మిత్ర, సేవా వజ్ర, సేవా రత్న అవార్డులను ఆయన ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారిని శాలువాలు కప్పి అభినందించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఈదర రాధిక, జెడ్పీటీసీ చౌడయ్య, వైస్ ఎంపీపీ గోలి భాగ్యలక్ష్మి, కొండవర్జు వరుణ్ కుమార్, ఎంపీడీవో రంగ నాయకులు, మండల వైఎస్సార్ సీపీ నాయకులు బుచ్చయ్య, గోనుగుంట్ల వెంకట హనుమయ్య, బొల్లా రమేష్, ఈపూరు సొసైటీ అధ్యక్షులు బొల్లా బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యానేరం

సీడీపీవో అనురాధ



శావల్యాపురం: బాల్య వివాహాలు చేయటం చట్టరీత్యా నేరమని సీడీపీవో ముదివర్తి అనురాధ అన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాలికలను రక్షించుకుందాం... బాలిక విద్య సమాజానికి ఎంతో మేలు అను కార్యక్రమంపై వైద్య ఆరోగ్య సిబ్బంది ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీవో అనురాధ మాట్లాడుతూ బాలికలను రక్షించుకునే బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని అలాగే బాలిక విద్యను ప్రోత్సహించటం ద్వారా సమాజంలో అందరికీ మేలు జరుగుతుందన్నారు. బాల్య వివాహాలు చేయడం ద్వారా శారీరకంగా మానసికంగా అన్ని విధాలుగా బాలికలు ఇబ్బందులు పడుతారన్నారు. బాల్య వివాహాలు చేయడంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి ఇలాంటి సదస్సులు ఎంతగానో దోహదపడతాయన్నారు. బాల్య వివాహాలు నిషేధించడానికి గ్రామ సచివాలయ స్థాయిలో మహిళా పోలీసులు మండల స్థాయి అధికారులు టీంగా ఏర్పాటు చేశామన్నారు.

పేదలకు అండగా సీఎం రిలీఫ్‌ఫండ్

చిలకలూరిపేట: పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసా కల్పిస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు చెప్పారు. పట్టణంలోని బ్యాంకుకాలనీలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 58 మంది లబ్ధిదారులకు రూ. 58.93 లక్షల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్లు కొలిశెట్టి శ్రీనివాసరావు, వలేటి వెంకటేశ్వరరావు, సొసైటీ ఛైర్మన్లు కొండవీటి ఆంజనేయులు, మంగు ఏడుకొండలు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, నాయకులు తాళ్ల అంజిరెడ్డి, పంగులూరి వెంగళరాయుడు, కొప్పురావూరి పటేల్, ఆదంవలి, కాట్రగడ్డ రామకృష్ణ, కాట్రు రమేష్, కోట్యానాయక్, మద్దూరి భాస్కరరెడ్డి, నాగూర్, శివమణి, ఇర్రి రాఘవ, ముజాఫా, పోతవరం మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ ఈదర రాధిక

ఈపూరు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ ఈదర రాధిక అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ రానున్న వేసవి కాలంలో గ్రామాల్లో మంచినీటి ఎద్దడి లేకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని, మరమ్మతులకు గురైన బోర్లను వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. అలాగే విద్యుత్, విద్యాశాఖ, ఉపాధి హామీ పథకం, వైద్య, ఆరోగ్యశాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖలపై సమీక్ష నిర్వహించారు. సంబంధిత అధికారులు తమ శాఖల పనితీరు సమావేశంలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు గోలి భాగ్యలక్ష్మి, వరుణ్‌కుమార్, జెడ్పీటీసీ చౌడయ్య, ఎంపీడీవో రంగనాయకులు, తహసీల్దార్ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

నరసరావుపేట మార్బుల్స్ వర్కర్స్ యూనియన్ కార్యవర్గం ఏర్పాటు

అధ్యక్ష, కార్యదర్శులుగా పాండురంగ, నాగం మల్లి



నూతన కార్యవర్గ సభ్యులతో వర్కర్లు

నరసరావుపేట: స్థానిక ఏఎస్ఆర్ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో నరసరావుపేట మార్బుల్స్ వర్కర్స్ యూనియన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వేముల పాండురంగా, ఉపాధ్యక్షులుగా జేష్ఠచిన్న, యూసఫ్ మస్తాన్, ప్రధాన కార్యదర్శిగా నాగం మల్లి, కోశాధికారిగా షేక్ బిలాల్, సహాయం కార్యదర్శులుగా రాఖీ, కృష్ణంశెట్టి కొండలు ఎన్నికయ్యారు.

చిల్లర దుకాణంలో చోరీ

నాదెండ్ల: గణపవరం మెయిన్‌రోడ్డులో నందం హరికృష్ణ చిల్లర దుకాణంలో చోరీ జరిగింది. ఆదివారం రాత్రి ఎప్పటిలాగే 10 గంటలకు తాళాలు వేసి ఇంటికి వెళ్ళాడు. సోమవారం ఉదయం 9 గంటలకు తిరిగి షాపు తెరవగా, చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చాడు. బాధితుడు నందం హరికృష్ణ తెలిపిన వివరాల మేరకు, దుకాణం పైకప్పు సిమెంటు రేకులు తొలగించి దుండగులు లోనికి ప్రవేశించారు. గల్లా పెట్టెలో ఉన్న సుమారు రూ.3 వేలు నగదు, రూ.3 వేల విలువైన సిగరెట్ ప్యాకెట్లను దొంగిలించినట్లు గుర్తించాడు. ఏఎస్సై రమేష్, సిబ్బంది సువర్ణరావు, మధు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

పాత కక్షల నేపథ్యంలో దాడి

చిలకలూరిపేట: పాత కక్షల నేపథ్యంలో కత్తితో దాడికి పాల్పడిన సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు జరిగిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని సంజీవ నగర్‌కు చెందిన సంగుల శివనాగరాజు అలియాస్ శివనాగేశ్వరరావు, అదే ప్రాంతానికి చెందిన తానేటి వంశీకు పాత గొడవలు ఉన్నాయి. ఇది మనసులో ఉంచుకొన్న వంశీ మరి కొందరు మిత్రులతో కలసి శివనాగరాజును మద్యం సేవిద్దామని మంచినీళ్ల చెరువు రోడ్డులోని పొలాల్లోకి తీసుకెళ్లాడు. మద్యం అయిపోయింది మరికొంత మద్యం తెస్తానని చెప్పి తానేటి వంశీ ఇంటికి వచ్చి కత్తి తీసుకొని తిరిగి మద్యం సేవిస్తున్న ప్రాంతానికి వెళ్లి శివనాగరాజుపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో శివనాగరాజు తలపై, కుడిచేయి, చెవి పై భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు నాగరాజును పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చి చికిత్స చేయిస్తున్నారు. ఆదివారం రాత్రి దాడికి పాల్పడి పరారైన వంశీ సోమవారం ఇంటి వద్దకు రాగా గమనించిన నాగరాజు స్నేహితులు కోటి, శేఖర్, వీరాస్వామిలు నాగరాజుపై దాడికి పాల్పడ్డారు. దీంతో అతనిని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. అర్బన్ పోలీసులు రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత దుర్మరణం

నరసరావుపేట రూరల్: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని ఉప్పలపాడు సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. సంతమాగులూరు మండలం తంగేడుమల్లి గ్రామానికి చెందిన మోటుపల్లి రాజేశ్వరి (32) వరుసకు సోదరుడయ్యే సఖిల చంద్రశేఖర్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై నరసరావుపేట మండలం జొన్నలగడ్డలో జరిగే శుభకార్యానికి బయలుదేరారు. ఉప్పలపాడు సమీపంలో వేగాన్ని నియంత్రించే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి పక్కకు పడిపోయింది. ఈ ఘటనలో రాజేశ్వరి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. చంద్రశేఖర్‌కు తీవ్రగాయాలయ్యాయి. అపస్మారకస్థితిలో ఉన్న అతడిని పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ రోశయ్య తెలిపారు.

భర్త వేధింపులతో భార్య ఆత్మహత్యాయత్నం

నరసరావుపేట టౌన్: భర్త వేధింపులు గురిచేస్తున్నాడని భార్య ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం పట్టణంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన వల్లెపు మల్లిఖార్జున రావుకు చీరాల ప్రాంతానికి చెందిన స్వాతితో 13 ఏళ్ల క్రితం వివాహం అయ్యింది. వీళ్లు ప్రకాష్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. గత కొన్ని నెలలుగా భార్య, భర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలో భార్యను భర్త, అతని కుటుంబ సభ్యులు వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో మనస్థాపం చెందిన స్వాతి క్రిమి సంహారక మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలిని సమీపంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న స్వాతి కుటుంబ సభ్యులు, బంధువులు సోమవారం పెద్ద సంఖ్యలో వైద్యశాల వద్దకు చేరుకున్నారు. ఆత్మహత్యాయత్నానికి కారణమైన భర్త మల్లిఖార్జునరావు, అతని తండ్రి వల్లెపు నాగేశ్వరరావుపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేశారు. బాధితురాలిచ్చిన ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణారెడ్డి తెలిపారు.

గుణాత్మక విద్యను బోధించాలి

ఎంఈవో సాంబశివరావు

శావల్యాపురం: ప్రాథమికస్థాయి నుంచి విద్యార్థుల్లో క్రమశిక్షణతో కూడిన గుణాత్మక విద్యను బోధించాలని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పాఠశాలల సముదాయాల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు ప్రభుత్వ పథకాలు మధ్యాహ్న భోజన పథకం అమలు, తీరు, జగనన్న గోరుముద్దా, బంగారుతల్లి పథకంలో భాగంగా బాలికల్లో హిమోగ్లోబిన్ శాతం నమోదు తదితరవన్నీ నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రాథమిక విద్యలో పునాది అభ్యసన కార్యక్రమాలతో పాటు 3,4 తరగతుల విద్యార్థుల్లో ఉపాధ్యాయుల బోధన తీరు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏంఈవో-2 పునులూరి లలితాకుమారి, కాంపెక్స్ చైర్మన్ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొద్దపాటి విజయలక్ష్మి, రిసోర్స్ పర్సన్స్ రాజారమేష్, డి.రవికుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఈవో సాంబశివరావు



నేడు ఎమ్మెల్యే బొల్లా జన్మదిన వేడుకలు

వినుకొండ(నూజెండ్ల):స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పుట్టిన రోజు వేడుకలు మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట పార్లమెంటు వైఎస్సార్ సీపీ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్ పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం ఎన్నికల శంఖారావం కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, పెద్దలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు, కార్యకర్తలు వేలాదిగా పాల్గొనాలని సూచించారు.

చిత్రకారుడు వజ్రగిరికి అవార్డులు


అవార్డు అందుకుంటున్న వజ్రగిరి జెస్టిస్

వినుకొండ (నూజెండ్ల): పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్ రెండు జాతీయ అవార్డులు అందుకున్నారు. 2024 జనవరిలో జరిగిన రెండు పోటీల్లో జెస్టిస్‌కు ప్రథమ బహుమతి, ఆర్ట్ లెజెండ్ అవార్డును గుంటూరులో అందుకున్నారు. అలాగే ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో మిచౌంగ్ తుపాన్ అనే అంశంపై నిర్వహించిన చిత్రకళా పోటీల్లో ప్రథమ బహుమతిని, ప్రతిష్టాత్మకమైన బాపు అవార్డును విజయవాడ బాలోత్సవ భవన్‌లో అందుకున్నారు. ఈ సందర్భంగా జెస్టిస్‌ను పట్టణానికి చెందిన చిత్రకారులు, రాజకీయ ప్రముఖులు, కవులు, రచయితలు, కళాకారులు, పాస్టర్లు, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.



